క్లుప్తంగా

రీసర్వేపై అవగాహన ర్యాలీ



తవణంపల్లె: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని వెంగంపల్లెలో సోమవారం రెవెన్యూ అధికారులు భూ రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ భూ రీసర్వే చేయడానికి మండలంలోని చెర్లోపల్లె రెవెన్యూ గ్రామాన్ని ఎంపిక చేసింది. దీంతో భూ రీసర్వేకు రైతులు సహకరించాలని కోరుతూ వెంగంపల్లె పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భూరీసర్వే డీటీ వెంకటరమణ, సర్వే డీఐ గిరిప్రకాష్, సర్పంచ్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

45 రోజుల్లో పరిష్కారం

ఐరాల: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల్లో అర్జీ సమర్పించి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ మహేష్‌కుమార్ కోరారు. మండలంలోని నాంపల్లెలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సమస్యలను అర్జీల రూపంలో అందిస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. రైతుల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రతి సమస్యకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. గ్రామంలో భూ సమస్యలపై 26 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్వర్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారా కేంద్రాలపై దాడులు


బెల్లం ఊటను వెలికి తీస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండం రాసనపల్లెలో సారా తయారీ కేంద్రాలపై చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలిసి రాసనపల్లె అటవీ ప్రాంతంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నాటుసారా తయారీ కోసం నిల్వ చేసిన 2,700 లీటర్ల బెల్లం ఊటను అధికారులు ధ్వంసం చేశారు. దీనిపై మూడు కేసులు నమోదు చేశామని, బెల్లం ఊట నిల్వ చేసిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు.

ఐదుగురికి గాయాలు

పూతలపట్టు (కాణిపాకం): రెండు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలైన సంఘటనలు సోమవారం చోటుచేసుకున్నాయి. మండలంలోని బత్తలవారిపల్లి గ్రామం వద్దం సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పెనుమూరు మండలం తాటిమాకులపల్లెకు చెందిన జగన్, లక్ష్మమ్మ, రోజా ద్విచక్ర వాహనంపై పూతలపట్టుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని బత్తలవారిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన స్థానికులు వారిని 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై పూతలపట్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

యాదమరి (కాణిపాకం): మండలంలోని కుక్కలపల్లి వద్ద సోమవారం ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పూనేపల్లెకు చెందిన ఖాదర్‌బాషా, బరకత్ ఓ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బంగారుపాళ్యంకు బయలుదేరారు. ఈ క్రమంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యతోపాటు విలువలు ముఖ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సాయిలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు విద్యతోపాటు విలువలు ముఖ్యమని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా మహిళా యూత్ సమన్వయ కర్త సాయిలక్ష్మి అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కృష్ణవేణి బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధ్యాత్మికత, జీవిత లక్ష్యం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే విలువలు పాటించడం నేర్చుకోవాలన్నారు. ఐకమత్యం, గురువులను, పెద్దలను గౌరవించడం, సేవాతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీదేవి, శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు మధుసూదనం, కన్వీనర్ నారాయణ, వికాస్ గురువు లావణ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తమిళ సంప్రదాయం ప్రకారం చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, అలంకారం, ధూపదీప నైవేద్యం తోమాల సేవ, వడమాల సేవ, సింధూర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. గిరింపేటలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కుర్రాళ్ల వేగానికి కళ్లెం


వాహనాల తనిఖీలో రవాణాశాఖ అధికారులు

అసలే కాలేజీ కుర్రాళ్లు.. పైగా స్పోర్ట్స్ బైక్.. ఇక తగ్గేదేలే అన్నట్లుగా ఓవర్ స్పీడ్‌తోపాటు జిగ్ జాగ్ డ్రైవింగ్, అరుపులు, వింత శబ్దాలు, బైక్ విన్యాసాలు.. ఇలా హద్దుమీరి నడుపుతారు. రోడ్డుపై వెళ్లే మిగతా వాహనచోదకులు హడలెత్తిపోయేలా హారన్లు, సైలెన్సర్లు అమర్చుకుంటారు. బండి రోడ్డెక్కితే ఆ సౌండ్ కిలోమీటర్ వరకు వినిపించేలా రేజ్ చేస్తుంటారు. వీరికి అసలు లైసెన్స్ తీసుకునే వయసు కూడా ఉండదు. అయినా రోడ్డంతా వీరే అన్నట్లుగా ఇష్టానుసారంగా బైక్‌పై వెళుతుంటారు. వీరిని కట్టడి చేసేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమయ్యారు. జరిమానాలతో పాటు కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

- రోడ్లపై విన్యాసాలు చేస్తే కఠిన చర్యలు
- లైసెన్స్ లేకుండా బండి నడిపితే జరిమానా
- వాహనాల తనిఖీలు ముమ్మరం చేసిన అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రహదారి నిబంధనలు కఠినంగా అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులు కంకణం కట్టుకున్నారు. వాహన చట్టం నిబంధనలు అతిక్రమించడంతోనే మృత్యువు వెంటాడుతోందని అధికారులు గుర్తించారు. ప్రధానంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల నిబంధనలను సరిగ్గా అమలు చేయడం లేదంటూ హైకోర్టు ధర్మాసనం అక్షింతలు వేసింది. ఈ నేపథ్యంలో వాహన చట్టాలను పక్కాగా అమలు చేసేందుకు రవాణా శాఖ అధికారులు సిద్ధమయ్యారు. వాహన తనిఖీల జోరును పెంచారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారుల్లో వణుకు పుడుతోంది.

330 మంది మృత్యువాత

జిల్లాలో ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 330 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 112 మంది ద్విచక్ర వాహనాల్లో వెళ్లి మృతి చెందారు. కారు ప్రయాణంలో 82 మంది, రవాణా వాహనాల ద్వారా 136 మంది చనిపోయినట్లు రవాణా అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదాల కట్టడికి ఇకపై కఠిన చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యంగా కాలేజీ కుర్రోళ్ల హైస్పీడుకు కళ్లెం వేసేలా చర్యలు తీసుకున్నారు. కాలేజీ పరిసర ప్రాంతాలపై దృష్టి పెట్టారు. కాలేజీ వదిలే సమయంలో తనిఖీలు చేపట్టేలా ఆదేశాలిచ్చారు. నూతన సంవత్సర వేడుకలకు ముందు నుంచి వాహన తనిఖీలను వేగవంతం చేయనున్నారు.

జరిమానాలు ఇలా...

- గతంలో మైనర్లు వాహనాలు వాడితే తల్లిదండ్రులకు శిక్ష పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.25వేలు జరిమానా విధిస్తారు. మూడేళ్ల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది.
- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే రూ.5000 జరిమానా విధిస్తున్నారు.
- అతివేగంగా వాహనాన్ని నడిపితే రూ.1,400 వసూలు చేస్తారు.
- రాంగ్ రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.1000 ఫైన్ విధిస్తారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం తాగి వాహనం నడిపితే) గతంలో రూ.2 వేలుగా ఉన్న జరిమానాను ఇప్పుడు ఏకంగా రూ.10 వేలకు పెంచారు.
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు వసూలు చేయనున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రూ.1000 కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- త్రిబుల్ రైడింగ్‌కు రూ.2వేలు జరిమానా విధిస్తున్నారు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు ఇచ్చుకోవాల్సిందే.



నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవు



రోడ్డు భద్రత సూచనలు పాటించకుండా చాలా మంది నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్నారు. ప్రధానంగా కళాశాల యువకులు యమస్పీడుతో బండ్లు నడుపుతున్నారు. ఈ స్పీడు కోసమే చాలా మంది స్పోర్ట్స్ బైక్‌లను వాడుతున్నారు. చివరకు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇలా ఈ ఏడాది 112 మంది యువకులు చనిపోయారు. ఇక మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే బండి సీజ్ చేసి వారి తల్లిదండ్రులను పిలిపిస్తాం. ఇకపై ఇష్టానుసారంగా బండి నడపడం కుదరదు. వాహన చట్టాలను పాటించాలి. నూతన సంవత్సరం పేరుతో తాగి బండి నడిపితే ఊరుకునే ప్రసక్తే లేదు.

–నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

కారుణ్య నియామకం



చిత్తూరురూరల్(కాణిపాకం): నగరంలోని జిల్లా పశు సంవర్ధక శాఖలో ఓ మహిళకు సోమవారం జేడీ ప్రభాకర్ కారుణ్య నియామక పత్రం అందజేశారు. పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పని చేస్తున్న ధనంజయ్య ఆరు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆయన భార్య శాంతివీరమ్మకు ఐరాల మండలం ఎల్లంపల్లిలోని పశువైద్యశాలలో అటెండర్ ఉద్యోగం ఇస్తూ నియామక పత్రం అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జేసీ విద్యాధరి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రారంభించబోయే అన్ని రకాల సేవలు, పథకాలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. బ్యాంకు పురోగతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని చెప్పారు. అనంతరం బ్యాంకు అధికారులు, రైతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

దారి సమస్యలపై విచారణ

యాదమరి(కాణిపాకం): యాదమరి మండలం కమ్మపల్లి గ్రామ పంచాయతీ రసూల్ నగర్‌లోని దారి సమస్యపై సోమవారం డీపీఓ సుధాకర్‌రావు విచారణ చేపట్టారు. కొందరు గ్రామంలో దారి సమస్య ఉందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీపీఓ ఆ దారిని పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి సుకుమార్, గ్రామస్తుల ద్వారా దారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్: అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం–1989 అమలుపై జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న చిత్తూరు ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి పశువుల పెంపకంలో గోకులం షెడ్ల ఏర్పాట్లకు భూమి తప్పక ఉండాలన్నారు. స్థలం ఉన్నట్లయితే ఈ పథకానికి అర్హులని తెలిపారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడైతే ఉంటుందో.. అక్కడ షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. రూ.2.50 లక్షలతో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు కేవలం రెవెన్యూ సమస్యలపైనే కాకుండా సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సూర్య ఘర్ పథకం, సోలార్ షెడ్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పలు సమస్యలు ఇలా....

డీవీఎంసీ సభ్యులు పలు సమస్యలను వెల్లడించారు. డీవీఎంసీ సభ్యులకు బస్సు పాస్ సౌకర్యం కల్పించి, గౌరవ వేతనం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ ఎస్టీల్లో చదువుకున్న వారికి ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో వివరాలు అప్లోడ్ చేసే ప్రక్రియ డిసెంబర్ 31తో గడువు ముగుస్తుందని ఈ గడువును పెంచేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు, డీఎఫ్‌ఓ భరణి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, అధికారులు రవికుమార్, శ్రీదేవి, పద్మజ, శోభరాణి, డీవీఎంసీ సభ్యులు బాబు, దేవరాజులు, డేవిడ్, రాజ్‌కుమార్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి భీమారావు, న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల సంఘం 2025 సంవత్సర క్యాలెండర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఆవిష్కరించారు. చిత్తూరు నగరంలోని జిల్లా జడ్జి చాంబర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నల్లారి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ఆవిష్కరణలకు వేదిక


డీఈఓ వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆవిష్కరణలకు వేదిక అని డీఈఓ వరలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బాల మేధావులే భావి శాస్త్రవేత్తలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ పరిశీలనాశక్తిని వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇందులో ప్రతిభ చాటే విద్యార్థులు జనవరి 21 నుంచి 25వ తేదీ వరకు దక్షిణభారత స్థాయిలో పుదుచ్చేరిలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొనేలా ఎంఈఓలు పర్యవేక్షించాలని డీఈఓ వెల్లడించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఐరాల: శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరూ వారి నివాసాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య కోరారు. మండలంలోని సోమవారం 35 యర్లంపల్లెలో సోమవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ వై రెడ్డి రాము ప్రారంభించారు. రెడ్డిరాము మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రాథమికోన్నత పాఠశాల పరిసరాలు, గ్రామంలో వారు విద్యార్థులతో కలిసి పిచ్చి మొక్కలు, చెత్త చెదారం శుభ్రం చేశారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న పీసీఆర్ విద్యార్థి ఆకాశ్

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారని కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 11 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, రీల్ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆకాశ్ (రీల్స్ పోటీల్లో మొదటి బహుమతి), పోస్టర్ ప్రజెంటేషన్‌లో పుంగనూరు మండలం కొత్త ఇండ్లు మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి మహమ్మద్ సాకిబ్ తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ఈ విద్యార్థులను డీఈఓ వరలక్ష్మి, డీవైఈఓ చంద్రశేఖర్ అభినందించారు.

విద్యార్థుల భవితకు బాటలు వేయండి


శిక్షణా మాడ్యూల్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

చిత్తూరు కలెక్టరేట్: ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనని తెలిపారు. విద్యావిధానమే అన్నింటికీ మూలమని చెప్పారు. విద్యార్థులకు స్మార్ట్‌ఫోన్‌లను దూరం చేయాలని సూచించారు. విద్యార్థులు పెడదోవ పట్టకుండా క్రమశిక్షణగా పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదేనన్నారు. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులను, తల్లిదండ్రులకు సూచించారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ బడులే సమాజాభివృద్ధికి ఆనవాళ్లని చెప్పారు. చిత్తూరులోని బీఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎందరో విద్యార్థుల భవితకు బాటలు వేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన వారంతా ఉన్నత శిఖరాలను అధిరోహించారని చెప్పారు. అనంతరం శిక్షణా మాడ్యూల్స్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, ఏపీ ఉమెన్ కార్పొరేషన్ మాజీ మెంబర్ వై.వి.రాజేశ్వరి, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్ఎం తులసిబాబు, సమగ్రశిక్ష సీఎంవో ఉదయలక్ష్మి, పాఠశాలల అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన ఐరాల విద్యార్థులు


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

ఐరాల: జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించినట్లు సోమవారం హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ జమ్ము కశ్మీర్‌లో డిసెంబర్ 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ బాల బాలికల విభాగంలో తమ పాఠశాలకు చెందిన విశేష ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పతకాలు సాధించారన్నారు. బాలుర విభాగంలో ప్రకాష్ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని కాంస్య పతకం, బాలికల విభాగంలో భవిత రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించడంతో క్రీడాకారులను, పీడీ దేవాను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, సెక్రటరీ రమేష్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర పంట లాభదాయకం


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: కొబ్బరితోటల్లో అంతర పంటగా కోకో సాగు లాభదాయకమని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో సోమవారం రైతులకు కోకో పంట సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేసుకోవడం వల్ల అధిక ప్రయోజనాలను పొందవచ్చని సూచించారు. మూడేళ్ల పైబడిన కొబ్బరితోటల్లో అంతర పంటగా కోకో పంట సాగుచేసుకోవచ్చన్నారు. ఉద్యానశాఖ ప్రైవేట్ కంపెనీ ద్వారా రైతులకు మొక్కలను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కోకో మొక్క ఒక్కటి రూ.18కు లభిస్తుందన్నారు. ఎకరాకు 200 నాటుకోవచ్చన్నారు. ఎకరా కోకో పంటకు ప్రభుత్వం రూ.20 వేలు రాయితీ అందిస్తుందని చెప్పారు. రైతులు పండించిన కోకో పంటను నేరుగా కంపెనీ వాళ్లే కొనుగోలు చేసి తీసుకువెళ్తారని పేర్కొన్నారు. నాటిన మూడో సంవత్సరం నుంచి 50 ఏళ్ల వరకు కోకో పంట నుంచి నికర ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక, బంగారుపాళెం, తవణంపల్లె వ్యవసాయశాఖ అధికారులు చిట్టిబాబు, ప్రవీణ్, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మునిసిపల్ గ్రీవెన్స్‌పై నిర్లక్ష్యం వద్దు


వృద్ధురాలి సమస్య వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఒక్క వినతి, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, ప్రజారోగ్య అధికారి లోకేష్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విజేత తన్వీర్‌కు అభినందన


తన్వీర్‌ను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: అంతర్జాతీయ, జాతీయ అబాకస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన మహమ్మద్ తన్వీర్‌ను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ శభాష్ తన్వీర్ అని అభినందించారు. నగరంలోని పాత ప్రశాంత్ నగర్‌లో నివాసమున్న జిక్రియా, సబీహ దంపతుల కుమారుడు మహమ్మద్ తన్వీర్ నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 16వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించిన అబాకస్ అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో మహ్మద్ తన్వీర్ మొదటి బహుమతి సాధించారు. ఆ విద్యార్థిని కలెక్టర్ అభినందించి, విద్యలో మరింత రాణించి ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు.

ఫిబ్రవరి 28 లోపు లైఫ్ సర్టిఫికెట్స్ ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు జీవన ధ్రువీకరణ పత్రాల (లైఫ్ సర్టిఫికెట్స్) ను 2025 జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోపు అందజేయాలని చిత్తూ రు ఎస్టీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీవన్ ప్రమాణ్ అప్లికేషన్ ద్వారా కానీ, జీవన్ ప్రమాణ్ ఫేస్ అప్లికేషన్ ద్వారా కానీ చిత్తూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో జీవన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 7780279158లో సంప్రదించాలని కోరారు.

ఈవీఎంల గోడౌన్ వద్ద పటిష్ట భద్రత

చిత్తూరు కలెక్టరేట్: ఈవీఎం గోడౌన్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద నిరంతరం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. త్రైమాసిక తనిఖీల్లో ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించినట్లు చెప్పారు. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో డీఆర్వో మోహన్‌కుమార్, ఉదయ్ కుమార్ (వైఎస్సార్ సీపీ), సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), పరదేశి (కాంగ్రెస్), గంగరాజు (సీపీఎం), ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్ పాల్గొన్నారు.